క్లుప్తంగా

కాంగ్రెస్ అభ్యర్థిగా చంటిబాబు



సవర చంటిబాబు

సీతంపేట: పాలకొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సీతంపేట మండలం కుశిమి పంచాయతీ పరిధి బంగారిగూడకు చెందిన సవర చంటిబాబును ఆ పార్టీ ప్రకటించింది. పీవీటీజీ (పర్టికులర్లీ వాలనరబుల్ ట్రైబ్ గ్రూప్) తెగకు చెందిన ఆయన బీఎస్సీ వరకు చదువుకున్నారు.

పోలీసుల కవాతు



గరుగుబిల్లిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గరుగుబిల్లి: ఓటుహక్కు వినియోగంపై ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఉండేందుకుగాను పోలీసులు కవాతు నిర్వహిస్తున్నారు. స్థానిక ఎస్‌ఐ అమ్మన్నరావు ఆధ్వర్యంలో ఆర్‌పీఎఫ్ సిబ్బంది గరుగుబిల్లి, పెద్దూరులో కవాతు నిర్వహించారు. రానున్న సాధారణ ఎన్నికలలో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమ మేలును కోరే అభ్యర్థులను ఎన్నుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరారు.

సారా పట్టివేత

సీతంపేట: మండలంలోని మండ గ్రామ సమీపంలో మంగళవారం 200 లీటర్ల సారా పట్టుకున్నట్టు ఎస్‌ఐ జగదీష్‌నాయుడు తెలిపారు. సారా బట్టీలపై దాడులు చేస్తుండగా ఐదుగురు వ్యక్తులు సారా అక్రమ రవాణా చేస్తున్నారన్నారు. వీరిలో నలుగురు పట్టుబడ్డారన్నారు. వీరిపై కేసు నమోదు చేసి, మరోవ్యక్తి ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



మూలిగూడ చెక్‌పోస్టు వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్పీ కృష్ణారావు

కురుపాం: మండలంలోని మూలిగూడ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పాలకొండ డీఎస్పీ కృష్ణారావు మంగళవారం పరిశీలించారు. పార్వతీపురం నుంచి గుమ్మలక్ష్మీపురం వైపు వెళుతున్న వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే ఈ మధ్య కాలంలో పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన 489 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. కురుపాం ఎస్సై షణ్ముఖరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: మండలంలోని గిజబ గ్రామంలో కాశీ శీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండప దేవతార్చనలు, వేద పాయారాయణం, కుంకుమార్చనలు, సూర్యనమస్కారాలు, తదితర పూజా కార్యక్రమాలను రుత్వికులు దుర్గాప్రసాద్ శర్మ, మణికంఠ శర్మ నిర్వహించారు. అనంతరం స్వామివారి శాంతి కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, సిబ్బంది

కురుపాం: పర్యావరణ పరిరక్షణకు విద్యార్థి దశ నుండే ప్రతీ ఒక్కరు కృషి చేయాలని స్థానిక జ్యోతీబాపూలే బాలుర ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. ఎనర్జీ క్లబ్‌కు సంబంధించి 'సేవ్ ఎనర్జీ–సేవ్ ఎన్విరానిమెంట్' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ ఆదా చేద్దాం–భావి తరాలకు భరోసానిద్దాం, పర్యావరణాన్ని కాపాడండి, ఎల్‌ఈడీ బల్బులను వినియోగించాలని నినాదాలు చేశారు. ర్యాలీలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని కైలాసనాథస్వామి ఆలయం 41వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 4 నుంచి పంచమ రాత్రి జాతర మహోత్సవాలు నిర్వహించనున్నారు. జాతర ప్రదేశాన్ని ఎల్విన్‌పేట సీఐ పి.సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ఆలయం వద్ద నిర్వహించే పూజలు, జాతరలో ఏర్పాటు చేస్తున్న వినోద పరికరాలు, భక్తులకు కల్పించే సదుపాయాలపై ఆలయ కమిటీ సభ్యులతో చర్చించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, ఆలయ కమిటీ సభ్యులు జి.హరిప్రసాద్, విష్ణు, వైస్ సర్పంచ్ కిషోర్, ఎస్సై శివప్రసాద్ ఉన్నారు.

అప్రమత్తతే ఔషధం

- వేసవిలో పశువులు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం
- పశు సంరక్షణపై పాడిరైతులు దృష్టిసారించాలి



గేదెలు

గరుగుబిల్లి: వేసవిలో పాడిపశువుల పోషణ, సంరక్షణపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లేదంటే పశువులు వ్యాధులకు గురికావడంతో పాటు పాల దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉందని పశువైద్య సిబ్బంది సూచిస్తున్నారు. పశువుల శరీరంలో నిరంతరం జరిగే జీవక్రియలు, పాల ఉత్పత్తి సమయంలో కూడా వేడి ఉత్పత్తి అవుతుంది. ఈ వేడిని నోటి ద్వారా, ఊపిరి ద్వారా, చెమట గ్రంథుల ద్వారా బయటకు పంపి శరీర ఉష్ణోగ్రత నియంత్రించుకుంటాయి. అయితే బయట వేడి ఎక్కువగా పెరిగినపుడు ఉష్ణోగ్రతను నియంత్రించుకోవడం వాటికి కష్టమవుతుంది. దాంతో పశువుల్లో అంతర్గత ఉష్ణోగ్రత పెరిగి అసహనం, అలసటకు గురై నీరశించిపోతాయి. ఆకలి మందగిస్తుంది. శ్వాస వేగం పెరుగుతుంది. గుండె వేగంగా కొట్టుకొని చివరకు సొమ్మసిల్లిపోతాయి. ఈలక్షణాలు కనిపిస్తే వడదెబ్బగా పరిగణించవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- పశువులకు వేడి తగలకుండా చల్లటి వాతావరణం ఉండేలా వసతి ఏర్పాటు చేయాలి.
- వేడి గాలి బయటకు వెళ్లేలా గుమ్మాలు ఉండాలి. అవసరమైతే ఫ్యాన్లు, స్ప్రింక్లర్లు ఏర్పాటు చేయాలి.
- షెడ్డుల వెలుపల నీడనిచ్చే చెట్లు పెంచుకోవాలి.
- గేదెలను ప్రతీ రెండు గంటలకు ఒకసారి నీటితో తడపాలి. మేతకు ఉదయం 9 గంటల లోపు, సాయంత్రం 5 గంటల తరువాత తీసుకువెళ్లాలి.
- పగలుకన్నా రాత్రి సమయంలో మేత ఎక్కువగా ఇవ్వడం మంచిది.
- తాగునీరు వాటికి ఎల్లప్పుడూ అందుబాటులో పెట్టాలి. ఎండుమేత తగ్గించి తినగలిగినంత పచ్చిమేత వేయాలి.
- పీచు పదార్థాలు ఎక్కువగా ఉండేలా ఎండు గ్రాసాలు మేపకూడదు. అత్యధిక పోషక విలువలు కలిగిన దాణా పెట్టాలి.
- షెడ్డులు వెలుపల నీటిని జల్లుతూ ఉండాలి. షెడ్డులపైన ఆకులు, పరదాలు కప్పి నీటితో తడపాలి. షెడ్డు పైభాగంలో తెలుపురంగు పెయింట్‌ను వేయించాలి. షెడ్డు చుట్టూ పరదా కప్పి నీటితో తడపాలి. పశువులను కిక్కిరిసి ఉంచకూడదు.

వేసవితాపం లక్షణాలు..

వేసవి తాపాన్ని సంకరజాతి పశువులు తట్టుకోలేవు. నలుపు రంగులో ఉన్న గేదెలు చాలా ఇబ్బంది పడతాయి. వేడి వల్ల మేత తినడం తగ్గిస్తాయి. నీరు ఎక్కువగా తాగుతాయి. బరువు తగ్గుతాయి. పాల దిగుబడి తగ్గుతుంది. గర్భస్రావం కావచ్చు. సకాలంలో ఎదకు రావు. ఉష్ణోగ్రతను తగ్గించుకొనేందుకు నోటిద్వారా వేగంగా శ్వాసక్రియ జరుపుతాయి. నాలుక బయటకు పెట్టి నోటినుంచి సొంగ కారుస్తాయి. ఇలాంటి లక్షణాలు ఉంటే వేసవి తాపానికి గురైనట్లు గుర్తించాలి. ఒక్కోసారి శ్వాస తీసుకోలేక పశువుల చనిపోయే ప్రమాదం ఉంది.



సంకరజాతి ఆవు

వడదెబ్బతో పశువులు బలహీనం..

వడదెబ్బకు గురైన పశువుల్లో పోషకాహారం లోపం ఏర్పడుతుంది. యద కాలం తగ్గిపోతుంది. పశువులు ఒత్తిడికి గురికావడంతో వాటిలో వ్యాధి నిరోధకశక్తి తగ్గిపోతుంది. గొంతువాపు వ్యాధి, పాదుగువాపు వంటి వ్యాధులు వ్యాపిస్తాయి.

అప్రమత్తంగా ఉండాలి



ఎండలు అప్పుడే మండిపోతున్నాయి. ఈ ఏడాది వేసవిలో ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. వేసవిలో పశువులు వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువ. పాడి రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. పశువులుకు వడదెబ్బ తగలకుండా చూడాలి. తాగునీటిని అందుబాటులో ఉంచాలి. – సురేష్‌కుమార్, పశు వైద్యులు, గరుగుబిల్లి

అడుగడుగునా జన నీరాజనం



భామినిలో ఎమ్మెల్యే కళావతికి హారతులు పడుతున్న మహిళలు

- జగనన్న పాలనకు మద్దతు
- పేదల పెన్నిధికి అండగా ఉంటామని భరోసా
- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతికి సంపూర్ణ మద్దతు

భామిని: మండలంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి జనం నీరాజనం పట్టారు. అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. మండలంలోని లివిరి, బైరి కాలనీ, గొల్ల కాలనీ, భామిని, అనంతగిరి, కారిగూడ, ఇసుకగూడ, సన్నాయిగూడ గ్రామాల్లో ప్రచారం విస్తృతంగా నిర్వహించారు. నల్లరాయిగూడ, సొలికిరి, బాలేరులో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న అందించిన సంక్షేమ పథకాలతో పేదల బతుకుల్లో వెలుగులు వచ్చాయన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు మళ్లీ అందాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. అభివృద్ధి పనులకు అంతా సహకరించాలన్నారు. కూటమి పేరిట జట్టు కట్టి వస్తున్న వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు గ్రామాల్లో మహిళలు మంగళహారతులు పట్టారు. ఘన స్వాగతం పలికారు. ముందుగా లివిరిలో గోపీనాధ రాధాకృష్ణుల సన్నిధిలో ఎమ్మెల్యే కళావతి ప్రత్యేక పూజలు చేశారు. ప్రచారంలో ఎంపీపీ తోట శాంతికుమారి, జెడ్పీటీసీ బొడ్డేపల్లి చిన్నమ్మి, ఎంపీటీసీలు పొట్నూరు ఉషారాణి, పాలక ఉషారాణి, సర్పంచ్‌లు బైరి సౌదామిని, బిడ్డిక గౌయింతి, జామి ప్రభాకర్, పార్టీ నాయకులు టి.సింహచలం, కె.చిరంజీవులు, ఎం.మోహనబాబు, టి.అన్నాజీరావు, కె.చంద్రశేఖర్, జి.రమేష్, బి.ధర్మారావు, ఎం.కేశవ, బి.భార్గవనాయుడు, కైలాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణలో 'ఆశా'లే కీలకం

- డీఎంఓ జగన్మోహనరావు



నీలకంఠాపురం పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంఓ జగన్మోహనరావు

కురుపాం: ఆరోగ్య సమస్యలు వెంటనే గుర్తించటంలో ఆశా కార్యకర్తలే కీలకమని జిల్లా మలేరియా అధికారి (డీఎంఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని మొండెంఖల్, నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీఎంఓ ఆరోగ్య కేంద్రాల్లో అందుతున్న సేవలపై సమీక్షించారు. గ్రామాల్లో ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారిని గుర్తించి వెంటనే ఆస్పత్రిలో చేర్పించి తగిన చికిత్స అందజేయడంలో ఆశా కార్యకర్తలు కీలకంగా వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా గర్భిణి, బాలింతలు, నవజాత శిశువులు, దీర్ఘకాలిక రోగులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, వైద్యాధికారులు అభినవ్‌కుమార్, అమర సింహారెడ్డి, సూపర్‌వైజర్లు శ్రీహరి, రాజులమ్మ, విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



అట్టలి వద్ద వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

పాలకొండ రూరల్: మండలంలోని అట్టలి, తుమరాడ గ్రామాల సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో ఎస్.రామకృష్ణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో జాబ్ కార్డుదారుల సంఖ్య, ప్రతి నిత్యం పనులకు హాజరౌతున్న వేతనదారుల సంఖ్య, రికార్డులు నమోదును పరిశీలించారు. ఈ క్రమంలో అధికారి మాట్లాడుతూ సాంకేతిక సహాయకులు అందించిన కొలతలు మేరకు పనులు పూర్తి చేయాలన్నారు. తాజాగా వేతనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రూ.272 నుంచి రూ.3వందలకు పెంచిన క్రమంలో నిబద్ధతతో పనులు చేయాలన్నారు. క్రమం తప్పకుండా హాజరు కావాలని సూచించారు. పనులు జరిగే చోట తప్పనిసరిగా వేతనదారులు భద్రతను దృష్టిలో పెట్టుకుని తగిన జాగ్రత్తలు అమలు చేయాలన్నారు.

నేడు మండల సమావేశం

జియ్యమ్మవలస: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొంగు సురేష్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఉదయం 10.30 గంటలకు తప్పక హాజరు కావాలన్నారు. అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

అరకు ఎంపీ టికెట్ నిజమైన గిరిజనులకు కేటాయించాలి

గుమ్మలక్ష్మీపురం: అరకు ఎంపీ సీటును బీజేపీ అధిష్టానం నిజమైన గిరిజనులకే కేటాయించాలని బీజేపీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు నిమ్మక జయరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకర్లతో సమావేశమై మాట్లాడారు. పొత్తులో భాగంగా అరకు పార్లమెంటు నియోజకవర్గానికి బీజేపీ అభ్యర్థిగా ప్రకటించిన కొత్తపల్లి గీత ఎస్టీ కులానికి చెందిన మహిళ కాదని, తమ వద్ద తగిన ఆధారాలు ఉన్నాయన్నారు. 2014 ఎన్నికల్లో తప్పుడు అఫిడవిట్లు దాఖలు చేసి పార్లమెంటు సభ్యులుగా ఎన్నికయ్యారని, ఆ సమయంలోనే వివిధ ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, ఉద్యోగ సంఘాలు ఆమెపై కులంపై పలు ఫిర్యాదులు చేశాయని గుర్తుచేశారు. డీఎల్సీ కమిటీ ద్వారా కుల ధ్రువీకరణ పత్రం పొంది ఉన్నత స్థాయి అధికారుల చేత కుల ధ్రువీకరణ పత్రం తీసుకున్నారని, తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఆమె ఎస్టీ కులానికి చెందిన వ్యక్తి కాదని తీర్పు వెలువడిందన్నారు. ఆమె సోదరుడు ఎస్టీ కానప్పుడు ఆమె ఎలా ఎస్టీ అవుతుందన్నారు. దీనిపై న్యాయస్థానంను ఆశ్రయించడం జరిగిందన్నారు. అరకు ఎంపీ సీటును నిజమైన ఎస్టీలకే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈయన వెంట నియోజకవర్గం కార్యదర్శి నాగూరు వైకుంఠరావు ఉన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలసలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం 2లో భాగంగా 300 మందికి ఆరోగ్య పరీక్షలు చేసినట్లు డాక్టర్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఎంపీడీఓ ఎం.వి.బి.సుబ్రహ్మణ్యం శిబిరాన్ని సందర్శించారు. రక్తహీనత ఉన్న వారిని గుర్తించి వారికి తగు వైద్యాన్ని అందించాలని ఎంపీడీఓ సూచించారు.

ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత

పాలకొండ రూరల్: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య రక్షణకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి శివశంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని నవగాంలో ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా 322 మందికి ఉచిత వైద్య సేవలు అందించారు. వివిధ రకాల కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి కంటి పరీక్షలను నిపుణులు కృష్ణమూర్తి నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులు అందించారు. శిబిరాన్ని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ సందర్శించారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దుమ్మంగి పంచాయతీ గుణద గ్రామంలో లలిత విద్య గణేశ్వర పీఠం ఆధ్వర్యంలో గ్రామదేవత ఆలయం, గోశాల నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. కార్యక్రమానికి హైదరాబాద్‌లోని లలిత విద్య గణేశ్వర పీఠం అర్చకులు పవన్‌కుమార్ శర్మ పాల్గొని ప్రత్యేక పూజలు, హోమం చేశారు. కార్యక్రమంలో గుణద, టెంకసింగి, మల్లుగూడ, దుమ్మంగి గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

జీసీసీ గొదాం తనిఖీ

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని జీసీసీ మెయిన్ గొదాంను తహసీల్దార్ బి.రామారావు మంగళవారం తనిఖీ చేశారు. గొదాంలో ఉన్న సరుకుల నిల్వలు, డీఆర్ డిపోలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు సరఫరా చేసిన సరుకుల వివరాలకు సబంధించిన రికార్డులను పరిశీలించారు. సకాలంలో డిపోలకు సరుకులు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని గొదాం ఇన్‌ఛార్జ్ ఎం.సాంబశివరావుకు సూచించారు.

సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ

సీతంపేట: గ్రామ సచివాలయాల సిబ్బంది గ్రామాలకు వెళ్లి బుధవారం సాయంత్రం నుంచి పింఛన్‌దారులకు పింఛన్‌లు అందజేయనున్నట్టు ఎంపీడీఓ కె.గీతాంజలి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సచివాలయాలకు వచ్చిన వారికి కూడా విధిగా పింఛన్‌లు అందజేస్తారని తెలిపారు. లబ్ధిదారులు ఎటువంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

గరుగుబిల్లి: ప్రస్తుత వేసవిలో దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటుచేసిన చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని గొట్టివలస, ఉల్లిబద్ర బస్‌స్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతుండటంతో కూడళ్లలో, బస్‌స్టాండ్‌ల వద్ద, జన సంచారం ఎక్కువగా ఉన్నచోట దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఉదయం 10 గంటలలోపు రైతులు తమ పనులను ముగించుకొని ఇళ్లకు చేరుకోవాలన్నారు.

కళాకారులను ఆదుకోవాలి

జియ్యమ్మవలస: ఎన్నికల నిబంధనావళి నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞాపన పత్రాన్ని రిజిష్టర్ పోస్టులో పంపినట్లు ఏపీ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ద్వారపురెడ్డి ధనుంజయరావు, ప్రధాన కార్యదర్శి రౌతు వాసుదేవరావు మంగళవారం తెలిపారు. కరోనా సమయంలో రెండు సంవత్సరాల పాటు కళారంగం కుదేలైందని, దాంతో కళాకారులు జీవనోపాధి కోల్పోయి అనేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఏపీ కళాకారుల సంఘంలో 64 రకాల కళలకు సంబంధించి లక్షలాది మంది కళాకారులు ఉన్నారన్నారు. కళారంగాన్ని వృత్తిగా స్వీకరించి జీవిస్తున్న కళాకారులను, వారి కుటుంబాలను ఆదుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్లు తెలిపారు. రాష్ట్ర డీజీపీ, ఏపీలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు కూడా విజ్ఞాపన పత్రాలు సమర్పించామని తెలిపారు.

పింఛన్‌దారులపై ఎందుకింత కక్ష

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: టీడీపీ అధినేత చంద్రబాబు తీరుపై ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మండిపడ్డారు. పింఛన్‌దారులపై చంద్రబాబుకు ఎందుకింత కక్ష అని నిలదీశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. వలంటీర్లపై ఉన్న అక్కసును మరోసారి చూపించి వారిని పింఛన్లు పంపిణీ చేయకుండా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు తీరు వల్ల రాష్ట్రంలో లక్షలాది మంది పింఛన్‌దారులకు పింఛన్ కష్టాలు మొదలయ్యాయని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో వలంటీర్లందరూ చంద్రబాబుకు బుద్ధి చెబుతారని అన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి



డిప్యూటీ ఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పాలకొండ: విద్యార్థులు క్రమ శిక్షణ అలవర్చుకోవాలని డిప్యూటీ ఈవో పగ్రి కృష్ణమూర్తి అన్నారు. పట్టణంలోని వెంకమపేట ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే మంచి లక్ష్యాలు ఏర్పరుచుకుని వాటిని సాధించుకోవాలన్నారు. తల్లిదండ్రులకు, పుట్టిన ఊరుకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఎంఈఓ సోంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ భోదన అందిస్తున్నారని, ఇదే సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లల విద్యపై పరిశీలన చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. డిప్యూటీ ఈవో, ఎంఈవోలను హెచ్‌ఎం పరంకుశంనాయుడు, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

పాలకొండ: మండలంలోని ఓని ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం బలగ నాగమణి పాఠశాల వార్షిక నివేదికను వివరించారు. డిప్యూటీ ఈవో పి.కృష్ణమూర్తి, ఎంఈవో సోంబాబులు వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు పలు ప్రదర్శనుల చేశారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన గోగు సూర్యనారాయణను గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఈ సందర్భంగా సన్మానించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరానే ధ్యేయం



కొత్తగా అమర్చిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఏడీఈ మోహన్‌చక్రవర్తి

వీరఘట్టం: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే మా ధ్యేయమని పాలకొండ ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్ చక్రవర్తి అన్నారు. వీరఘట్టం 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. కొత్తగా అమర్చిన రూ.75 లక్షల విలువ గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేసి నాణ్యమైన విద్యుత్ సరఫరా పంపిణీకి చర్యలు చేపడతామన్నారు. ఆయన వెంట ఏఈ డి.బాలాజీ, ట్రాన్స్‌ఫార్మర్స్ ఈఈ టి.జగదీశ్వరరావు, జేఈ మురళి ఉన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



అవలంగిలో తన సిబ్బందితో కలసి పర్యటిస్తున్న నోడల్ అధికారి

పాలకొండ రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రవర్తన నియమావళిని ప్రతీ గ్రామంలో కచ్చితంగా అమలు చేయాలని మండల ఎన్నికల నోడల్ అధికారి ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని అవలంగి, అట్టలి, తుమరాడ తదితర గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. క్షేత్ర స్థాయిలో నిబంధనల అమలు తీరుపై పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెల్లో ఓటర్లను ప్రభావితం చేసే అంశాలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈవీఎంల ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అధికారులు సైతం ఎన్నికల నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలన్నారు.

రేపటి నుంచి ఎమ్మెల్యే కళావతి రెండవ విడత ఎన్నికల ప్రచారం

వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గంలో ఈ నెల 4 నుంచి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి రెండవ విడత ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. సీతంపేట మండలంలో ఈ నెల 4న పెద్దపొల్ల, దుగ్గి, నాయకమ్మగూడు, తిటుకుపాయి, మానాపురం గ్రామాల్లో, ఈ నెల 5న దోనుబాయి, కె.వీరఘట్టం, పుబ్బాడ, చిన్నపల్లంకి గ్రామాల్లో ప్రచారం చేస్తారు. వీరఘట్టం మండలంలో ఈ నెల 6న కంబర, చిట్టపులివలస, కిమ్మి, గడగమ్మ గ్రామాల్లో, ఈ నెల 7న చిదిమి, యు.వెంకమ్మపేట, తూడి, పాలమెట్ట గ్రామాల్లో, పాలకొండ మండలంలో ఈ నెల 8న డోలమడ, నవగాం, అవలంగి గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నారు. ఈ నెల 10న పొట్లి, జంపరకోట, ఎం.సింగుపురం పంచాయతీల్లో, భామిని మండలంలో ఈ నెల 11న బిల్లమడ, గురండి, నేరడి, వడ్డంగి పంచాయతీల్లో, ఈ నెల 12న బొడ్డగూడ, బూరుజోల, మనిగ, పసుకుడి పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం ఉంటుంది. వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ప్రచార కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

బాల్య వివాహాలు అరికట్టాలి



మాట్లాడుతున్న పీడీ సుగుణకుమారి

కొమరాడ: గ్రామల్లో బాల్య వివాహాలు అరికట్టించి, వారి బంగారు భవిష్యత్‌కు మంచి బాటలు వేయాలని కొమరాడ ఐసీడీఎస్ పీఓ జి.సుగుణకుమారి అన్నారు. ప్రాజెక్టు పరిధిలోని 206 కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో పాటు పోటీ పడుతున్నారని, ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించి తమ కాళ్లపై తాము నిలబడేలా వారిని పోత్సాహించాలన్నారు. బాల్య వివాహాలు ప్రోత్సహించే వారిపై చట్టం పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రక్తహీనత ప్రమాదకరం

వీరఘట్టం: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనత ఉంటే అది చాలా ప్రమాదకరమని డీఐఓ ఎం.నారాయణరావు అన్నారు. వీరఘట్టం, బిటివాడ పీహెచ్‌సీలను మంగళవారం ఆయన సందర్శించారు. ఆశా డే కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. రక్తహీనత ఉన్న వారిలో హిమోగ్లోబిన్ శాతం పెరిగేలా వారికి అంగన్‌వాడీ కేంద్రాల నుండి పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. అవసరమైతే వారికి డాక్టర్ సలహా తీసుకోవాలని సూచించారు. ఐదేళ్లలోపు చిన్నారులలో పోషకాహార ఎదుగుదల లోపం గుర్తించి వాటిని అధిగమించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఆయనతో పాటు వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.